క్లుప్తంగా

వైభవంగా బాబా మందిర వార్షికోత్సవం

పమిడిముక్కల: వీరంకిలాకులోని శ్రీ సంతాన సాయిబాబా మందిర 27వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చవితి ఉత్సవాలకు రాటా ప్రతిష్ట



గుడివాడ టౌన్: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్‌లో శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం రాటా ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు స్వామివారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు. నవరాత్రి మహోత్సవాల పనులు ప్రారంభ సూచికగా ఈ రాట ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ గంట చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు బంటుమిల్లి సూర్యనారాయణ, ఎస్. నేలవేణి, తాత రజినీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అల్లినగరంలో పొలంబడి



మండవల్లి: మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాలు పిలక దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో కాండం తొలుచు పురుగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. నివారణకు లింగాకర్షక బుట్టలు, చివరగా అగ్నాస్త్రం, పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జిలు నాగవిజయ, నారాయణ, శోభారాణి, వెంకటలక్ష్మి, ఐసీఆర్పీలు జగన్, రమేష్, ఉషారాణి, నజీర్‌ఖాన్, అహోబలరావు, రామారావు, రామాంజనేయులు, నళిని, నాగరాణి, రైతులు పాల్గొన్నారు.

గుడివాడ బస్టాండ్‌కు మహర్దశ

- రెండోదశ పనులు ప్రారంభం
- మొత్తం రూ.22.80 కోట్లు
- డిపో నిర్మాణానికి రూ.8.8 కోట్లు
- రెండోదశ అభివృద్ధికి రూ.6 కోట్లు
- మూడో దశలో మౌలిక సదుపాయాలు



నూతనంగా నిర్మించిన ఆర్టీసీ డిపో

గుడివాడ టౌన్: గుడివాడ బస్టాండ్ దశ, దిశ మారనుంది. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో బస్టాండ్ రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.22.80 కోట్లతో బస్టాండ్ ఆధునికీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

గత పరిస్థితి ఇదీ..

సుమారు 60 సంవత్సరాల క్రితం ఇక్కడ బస్టాండ్‌ను నిర్మించారు. అయితే ఈ బస్టాండ్‌లో ప్రయాణికులు గత 35 ఏళ్ల పైబడి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అప్పటి ప్రయాణికులను బస్సుల అవసరతను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన బస్టాండ్ అభివృద్ధికి తదుపరి వచ్చిన ఏ ప్రభుత్వమూ దృష్టిపెట్టకపోవడంతో బస్టాండ్ ఈ దుస్థితికి చేరుకుంది. వర్షం పడితే పట్టణంలో ఎక్కడా నీరు నిలవకపోయినా బస్టాండ్‌లో మోకాళ్లలోతు నీరు నిలబడుతుంది. ప్రయాణికుల సౌకర్యం కొరకు వర్షం నీటిని మోటారుతో తోడించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

గత పాలకుల తీరు ఇదీ..

ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు రెండు పర్యాయాలు, వివిధ ప్రభుత్వాల్లో రవాణా శాఖా మంత్రులుగా పనిచేసిన నాయకులు పలుమార్లు ఈ దుస్థితిని గమనించారు. డిపోలో పర్యటించిన సందర్భంలో వెంటనే వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామనడం, మీడియా ముందు హామీలు ఇవ్వడం, ఆ వెంటనే మర్చిపోవడం పరిపాటిగా మారింది.



పాత భవనాలను తొలగిస్తున్న కార్మికులు

నెరవేరిన పాదయాత్ర హామీ..

బస్టాండ్ దుస్థితిని తన పాదయాత్రలో గుర్తించిన వైఎస్ జగన్ మోహనరెడ్డి తాము అధికారంలోకి వస్తే గుడివాడ ఆర్టీసీ డిపోను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి పౌర సరఫరాల శాఖా మంత్రిగా ఉన్న కొడాలి నాని ముఖ్యమంత్రిని ఒప్పించి రూ.22.80 కోట్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు.

మూడు దశల్లో పనులు..

తొలిదశలో భాగంగా 8.80 కోట్లు కేటాయించి అధునాతన హంగులతో ఆర్టీసీ డిపోను నిర్మించారు. రెండో దశలో భాగంగా ప్రస్తుతం ఉన్న డిపో మేనేజర్ భవనం, బస్‌పాస్ కేంద్రం, కార్గో కార్యాలయాలు తొలగించి వాటి స్థానంలో 11 బస్సులు ఒక్కసారి నిలిపేందుకు బారీ ప్లాట్‌ఫారం, దూర ప్రయాణికుల కొరకు విశ్రాంతి గదులు, విశాలమైన ప్రయాణికుల కొరకు సీటింగ్, క్యాంటీన్, కార్గో కార్యాలయం, ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంతో పాటు ఇతర శాఖల కార్యాలయాలు అధునాతన హంగులతో నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను సైతం తొలగించి విశాలమైన కాంప్లెక్స్‌తో పాటు ఇతర సౌకర్యాలు మూడో దశలో నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం రెండోదశ పూర్తయితే ప్రయాణికులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా బస్సులు నడుపుతామని అధికారులు అంటున్నారు.

ఊహించని పరిణామం



రాష్ట్రంలో ఒక్క డిపో అభివృద్ధికి ఇంతపెద్ద మొత్తంలో ఒకేసారి నిధులు కేటాయించడం చాలా అరుదు. డిపో అభివృద్ధి చేస్తే బస్టాండ్ వదిలేసేవారు. బస్సుల ప్లాట్ ఫారాలు ఆధునికీకరిస్తే డిపో మేనేజర్ భవనాలు, ఉద్యోగుల క్వార్టర్స్ పట్టించుకునేవారు కాదు. అలా అంచలంచెలుగా మరమ్మతులు చేయడం, చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టడం గతంలో పద్ధతి. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తంలో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి నూతన హంగులతో నిర్మాణం చేపట్టడం విశేషమే. ఇది శుభ సూచకం.

జి.రాజేష్ కుమార్, డిపో మేనేజర్, గుడివాడ

వర్షం వస్తే బయట నిలబడేవాళ్లం



నాకు ఊహ తెలిసిననాటి నుంచి వర్షం వస్తే బస్టాండ్‌లోకి రావాలంటే ఇబ్బందిగా ఉండేది. మోకాళ్లలోతు నీటిలో మునిగి ఉండేది. లోపలకు రాడానికి ఇబ్బందిగా ఉండటంతో బస్సులు రోడ్డుపైకి వచ్చాకే బస్సులోకి వెళ్లేవాళ్లం. ఇంత పెద్దెత్తున నిధులు కేటాయించి అభివృద్ధిచేయడం గుడివాడ పట్టణ, పరిసర ప్రాంత ప్రజల అదృష్టం. –ఇస్సాకు, ప్రయాణికుడు

అభివృద్ధితో పాటు ఆదాయం..



బస్టాండ్ ఆధునీకరించడం వలన ప్రయాణికులకు సౌకర్యాలు పెరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా చేకూరుతుంది. ఇప్పటికే కార్గో ద్వారా ఆదాయాన్ని సేకరిస్తున్న ఆర్టీసీ మూడోదశలో షాపింగ్ కాంప్లెక్స్ కూడా పూర్తిచేస్తే వసతులతో పాటు ఆదాయం కూడా వస్తుంది. ఇంతపెద్ద మొత్తంలో పనులు చేపట్టడం శుభపరిణామం

–ఎం.నరసింహారావు, ప్రయాణికుడు

దోమల నివారణకు చర్యలు



మండవల్లిలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మండవల్లి: మండవల్లిలోని పలు ప్రాంతాల్లో దోమల బెడద అధికమవడంతో సర్పంచ్ మెండా ఝాన్సి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఝాన్సి మాట్లాడుతూ ఫాగింగ్ వల్ల దోమల బెడద తగ్గే అవకాశాలున్నందున ఫాగింగ్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెచ్‌వీ మోతీబి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తోట్లవల్లూరు: వ్యక్తిపై దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. రమేష్ తెలిపారు. మండలంలోని యాకమూరులో బొల్లెద్దు వెంకటేశ్వరరావు పంచాయతీ ట్యాంకు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం అతను ట్యాంకు నీటిని వదలటానికి వెళుతుండగా దారిలో కుక్క వెంటపడింది. దానిపై అతను రాయి విసిరాడు. దీంతో కుక్కపై రాయి వేస్తావా అంటు దాని యజమానులైన సాతులూరి శ్యామ్, వంశీ ఇనుప పైప్‌తో వెంకటేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలకు బలమైన గాయం కావటంతో ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు

కూచిపూడి(మొవ్వ): టీటీడీ బోర్డులో నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తూ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సిద్ధవటం యానాదయ్యను డైరెక్టర్‌గా నియమించడంపై కూచిపూడి నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి, పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పావులూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమకు, తమ వృత్తికి ఏ నాయకుడు చేయని విధంగా గౌరవం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొల్లూరి వెంకట శ్రీనివాసరావు, కనపర్తి ప్రధానరావు, అయనంపూడి శివరామ ప్రసాద్, కే రాఘవేంద్రరావు, సుబ్రమణ్యం, అయ్యంకి వెంకటేశ్వరరావు, మోపిదేవి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులకు భూమి పూజ



భూమిపూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

గుడివాడ టౌన్ (నందివాడ): మండలంలో ప్రతి గ్రామానికి సురక్షితమైన మంచినీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నాయకులు అన్నారు. సోమవారం నందివాడ మండలం తమిరిశ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.29 లక్షలతో ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్ వలన ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందుతుందన్నారు. చేపల చెరువుల కారణంగా తాగు నీరు మండలంలో కొన్ని గ్రామాలకే పరిమితమని గ్రహించిన ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వర (నాని) ప్రభుత్వం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణం, గ్రామ సర్పంచి చప్పిడి ధనలక్ష్మి, వైఎస్సార్సీపీ నాయకులు సాల్మన్ రాజ్, కందుల నాగరాజు పాల్గొన్నారు

రేపటి నుంచి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసనలు



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా ఈనెల 30 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ఇందుకు కారణమన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్ వ్యవస్థలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతున్నందునే ఈ విధమైన మార్పులకు కారణమన్నారు. దీనికి నిరసనగా రోజుకొక అంశంపై నిరసనలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌సీపీ రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతకు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పామర్రు: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా పామర్రు ప్రముఖ మిల్లర్ బొగ్గరపు శ్రీనివాస్‌ను కమిటీ సభ్యులు సోమవారం ఎంపికచేశారు. ఈనేపథ్యంలో పామర్రు మండలం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. బొగ్గరపు శ్రీనివాస్ స్థానిక జెడ్పీ పాఠశాలలో 1986–87 ఏడాదిలో పదో తరగతి చదివారు. ఈ సందర్భంగా 86–87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ కలిసి తన స్నేహితుడు జిల్లా అసోసియేషన్‌లో జాయింట్ సెక్రటరీగా ఎంపిక అయినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మరింత ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పానిపిరెడ్డి శ్రీహరి, జెన్యావుల శ్రీనివాసరావు, నూకల కొండ, సంజీవరావు, శైలజ, గోర్జి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో అన్నదానం



అన్నదానం షెడ్డులో భోజనం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన కమిటీ ఆధ్వర్యాన దాతల ఆర్థిక సహకారంతో సోమవారం నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. విజయవాడకు చెందిన దాత గునుకుల పుల్లయ్య, వసంత దంపతులు, వారి కుమారుడు చంద్రశేఖర్, అనూష సహకరించారు. పుల్లయ్య దంపతుల పెళ్లిరోజు, శ్రావణమాసం పురస్కరించుకుని కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వహణ సంధానకర్తలు రాచంశెట్టి పాపారావు, పొన్నపల్లి చిన్నా పర్యవేక్షణలో బండ్రెడ్డి బోసు, పొన్నపల్లి లంకమ్మ, సబ్బినేని రాణి, మత్తి శేషుబాబు తదితరులు సేవలందించారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

పెదపారుపూడి: రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని యలమర్రు గ్రామం తప్ప, అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. వారం రోజుల్లో యలమర్రు గ్రామం కూడా రీసర్వే పనులు పూర్తి చేస్తామన్నారు. రీసర్వే ద్వారా ఏళ్లగా ఉన్న భూసమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులకు మంచి అవకాశం వచ్చిందన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెదపారుపూడి: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన కేసూలు నమోదు చేస్తామని ఎస్ఐ పల్లా నాగకల్యాణి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టు తరలిస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు ఆర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజల్లో స్పందన కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్ఐ నాగబాబు, విఆర్వోలు, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఆస్పత్రులకు వచ్చే రోగులను చిరునవ్వుతో పలకరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎల్లప్పుడూ ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఓపీ సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సీహెచ్‌సీలో విద్యుత్ కేబుల్ పాడవడంతో రూ.60 వేలతో పునరుద్ధరణ, ఆర్వో వాటర్ ప్లాంటు, ఇతర ఖర్చులను అభివృద్ధి కమిటీ సభ్యులు వివరించారు. అనంతరం సీహెచ్‌సీలో ఇటీవల జరిగిన అవకతవకలపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎం ఇందిరాదేవీకి ఫోన్‌లో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యుడు దూలం ఫణి శ్యామ్‌కుమార్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైద్యులు దుర్గాప్రసాద్, అల్లాడి శ్రీనివాస్, నీలిమ, రమ్య, కీర్తి, గీతాంజలి, అనుపమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ..

ఇటీవల సీహెచ్‌సీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఎమ్మెల్యే ఫోన్ చేయడంతో డీసీహెచ్ఎం ఇందిరాదేవీ సిబ్బంది హుటాహుటిన కైకలూరు సీహెచ్‌సీకి వచ్చారు. నిధులు ఎంత ఖర్చుపెట్టారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన సిబ్బంది రికార్డులు అప్పగించారా? లేదా అనే విషయాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఫణి శ్యామ్ కుమార్, సీహెచ్‌సీలో మౌలిక వసతులు, వైద్యుల కొరతను డీసీహెచ్ఎంకు వివరించారు.

4న సంచార పశు ఆరోగ్యసేవ డ్రైవర్లకు ఇంటర్వ్యూలు

కైకలూరు: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ ఉద్యోగ భర్తీలో భాగంగా డ్రైవర్లకు సెప్టెంబరు 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా మేనేజరు పి.శివతేజ సోమవారం చెప్పారు. ఏలూరు, నూజివీడు, ముసునూరు, తణుకు, పెరవలి ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. డ్రైవర్ల వయసు 37 ఏళ్ల లోపు ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. హెచ్ఎంవీ లేదా బ్యాడ్జీ (ట్రాన్స్‌పోర్టు), రెండు, మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఇంటర్వ్యూ ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం వెనుక వెటర్నరీ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన డ్రైవర్లు హాజరు కావాలని కోరారు. వివరాలకు 91105 95889 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.